క్లుప్తంగా

నేడు 'జగనన్నకు చెబుదాం'

పెళ్లకూరు: మండల కేంద్రంలో బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంగళవారం తహసీల్దార్ రామయ్య తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పెళ్లకూరులోని చాగణం ట్రస్టు ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని మండల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులతో పాటు జిల్లా అధికారులు కూడా పాల్గొంటారని చెప్పారు.

గొట్టికాటికి ఎమ్మెల్సీ పరామర్శ


రవీంద్రారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిట్టమూరు: మండలంలోని మొలకలపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత గొట్టికాటి రవీంద్రారెడ్డిని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మంగళవారం పరామర్శించారు. రవీంద్రారెడ్డి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతూ బెంగళూరులో చికిత్స చేయించుకుని కొద్ది రోజుల క్రితం స్వగ్రామానికి చేరుకుని, విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, రవీంద్రారెడ్డి ఇంటికి వెళ్లి, ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎస్ శ్రీనివాసులురెడ్డి, ఆనందకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

మరమ్మతు చేయాలని వినతి

చిట్టమూరు: మండలంలోని తంబుగారిపాళెంలో సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని, దాన్ని మరమ్మతు చేయాలని గ్రామస్తులు ఏఈ పోలయ్యకు మంగళవారం విజ్ఞప్తి చేశారు. ఇళ్లకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ నాలుగు రోజుల క్రితం కాలిపోయిందన్నారు. దీంతో సరఫరా నిలిచిపోయిందన్నారు. ఈ విషయంపై కొత్తగుంట సబ్‌స్టేషన్ ఏఈ పోలయ్య మాట్లాడుతూ బుధవారం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు.

భవనాల ప్రారంభం రేపు

రాపూరు: మండలంలోని గోనుపల్లెలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, మిల్క్ సెంటర్ భవనాలను గురువారం వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ పీ దయాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

కండలేరులో 13.102 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 13.102 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. జలాశయానికి వరదకాలువ నుంచి 100 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందన్నారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్ కు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏపీఎం రీజాయినింగ్‌పై విచారణ చేపట్టాలి

తిరుపతి కల్చరల్: తిరుపతి జిల్లా డక్కిలి మండలం, ఏపీఎం ఎం.పోలమ్మ అవినీతి ఆరోపణలపై ఈ నెల 11న నెల్లూరు ప్రాజెక్టు వారికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని, సరెండర్ ఉత్తర్వులు ఇచ్చిన తిరుపతి డీఆర్‌డీఏ పీడీ వెంటనే పోలమ్మను అదే మండలానికి పోస్టింగ్ ఇచ్చారని, పోలమ్మ రీజాయినింగ్‌పై జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టాలని ఏపీ ప్రజా సంఘాల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దల మునెయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు పోలమ్మ విధి నిర్వహణలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారని, దీనిపై సాక్షాత్తు జిల్లా స్థాయి డీఎంజీ బృందం పరిశీలించి తుది నివేదిక ఇవ్వడంతోనే పోలమ్మను నెల్లూరు ప్రాజెక్టుకు సరెండర్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. అయితే తొలగించిన మండలానికే పోలమ్మకు ఆగమేఘాలపై ఉత్తర్వులు ఎలా ఇచ్చారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు డి.చిరంజీవి, ఎస్‌కే.రఫీ పాల్గొన్నారు.

సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలి

కోట: విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని ఎంపీడీఓ భవాని సూచించారు. మండల స్థాయి సైన్స్‌ఫేర్‌ను మంగళవారం కోట జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆమె ప్రారంభించారు. మండలంలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరై తాము రూపొందించిన నమూనాలను ప్రదర్శనకు ఉంచారు. వ్యక్తిగత ప్రాజెక్టు, గ్రూప్ ప్రాజెక్టు, ఉపాధ్యాయుల ప్రాజెక్టు విభాగాల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. వారిని జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మస్తానయ్య, హెచ్‌ఎంలు సురేంద్రబాబు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాత సీఎం జగన్

సైదాపురం: నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపేలా పాలన సాగిస్తున్న సంక్షేమ ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సర్పంచ్ శారద అధ్యక్షతన మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ నవరత్నాల పథకాల ద్వారా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. అంతకుముందు జరిగిన పట్టాల పంపిణీ కార్యక్రమంలో జగన్ సార్..వన్స్‌మోర్ అనే ప్రకటన పలువురిని ఆకర్షించింది. మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ప్రకటనలకు విశేషాదరణ లభించింది. ఈ సందర్భంగా నేదురుమల్లికి కూడా కొందరు సమావేశంలో సాక్షి దినపత్రిక చూపారు. దీనిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సాక్షి దినపత్రికను చదివి ఆదరించాలని కోరారు. అనంతరం సభలో చిరునవ్వులతో సమావేశం ముగించారు.


సభలో సాక్షి దినపత్రికను చూపుతూ మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న క్రీడామహోత్సవం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో జిల్లా యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. సైదాపురంలో మంగళవారం ఆడుదాం ఆంధ్ర కిట్లను సర్పంచ్ శారద అధ్యక్షతన సచివాలయం సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసి, వారిని క్రీడల వైపు ప్రోత్సాహించేందుకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ మండల కన్వీనర్ రవికుమార్, సభ్యులు వీ ప్రభాకర్‌రెడ్డి, జే సీఎస్ మండల కన్వీనర్ జీ శ్రీనివాసులు రాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు జీ శివకుమార్, నేతలు రామ్‌గోపాల్‌రెడ్డి, మాలకొండారెడ్డి మోహన్‌రావు, రాఘవరెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, ఉప సర్పంచ్ శివకుమార్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు వివరాలు అందించాలి

సూళ్లూరుపేట రూరల్: మిచాంగ్ తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం పంపిణీకి నివేదికలను సిద్ధం చేస్తున్నామని, అర్హులైన రైతులు సంబంధిత పత్రాలు, వివరాలు అందజేయాలని ఏడీఏ అనిత తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ తడ, సూళ్లూరుపేట, దొరవాసత్రంలో పంటలపై ఇసుక మేటలు, కోతలకు గురైన భూములను వ్యవసాయ సహాయకులతో కలిసి పరిశీలించిన అనంతరం నివేదికలు సిద్ధం చేశామని తెలిపారు. ఈనె 23వ తేదీన ప్రభుత్వానికి ఈ నివేదికలు అందజేస్తునట్లు పేర్కొన్నారు. నష్టపోయిన రైతులు పొలాల వివరాలు, ఆధార్‌కార్డు, బ్యాంకు సంబంధిత పత్రాలను వ్యవసాయ సహాయకులకు అందజేయాలని సూచించారు. నష్టపోయిన రైతుల జాబితాను ఆయా ఆర్బీకే కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.


పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ ఏడీఏ

ట్యాబ్‌ల పంపిణీ రేపు

డక్కిలి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఈ నెల 21వ తేదీన ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓలు వెంకటేశ్వర్లు, జగదీష్ తెలిపారు. మండలంలోని ఎనిమిదో తరగతి విద్యార్థులకు మొదటి విడత 170 ట్యాబ్‌లు డక్కిలి మండలానికి వచ్చాయని, వీటిని డక్కిలి హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుకునే 75 మందికి, ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో చదువుకునే 80 మంది, పలుగోడు ప్రాథమిక పాఠశాలలో చదివే 15మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ట్యాబ్‌లను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మంగళవారం అందజేశారు. మిగిలిన విద్యార్థులకు కూడా నాలుగైదు రోజుల్లో ఆయా పాఠశాలలకు చేరుస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ గోను రాజశేఖర్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


డక్కిలి: గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌కు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంఈఓ

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా

గూడూరురూరల్ : రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామని, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు కూడా సహకరించాలని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం గూడూరు పట్టణ సమీపంలోని చవటపాళెంలో పోలీసు సిబ్బందితో కలసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లు, యువతను హెచ్చరించారు. డ్రగ్స్ ముఠా కలకలం నేపథ్యంలో శివారు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. ప్రతి రెండు నెలలకొకసారి కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. గాంధీనగర్, అడవికాలనీ, చవటపాళెం ప్రాంతాల్లో ఎక్కువగా బయటి ప్రాంతాలకు చెందిన వారు ఉండడంతో ప్రతి ఇంటిని తనిఖీ చేసి వివరాలు నమోదు చేశామన్నారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 22 మోటారు బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో రూరల్ సీఐలు దశరథరామారావు, హజరత్‌బాబు, వెంకటేశ్వరరావు, ఎస్.ఐ.లు మనోజ్‌కుమార్, అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు

దొరవారిసత్రం: మండలంలో తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ, పీఆర్ రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ చిన్నరాయుడు తెలిపారు. ఆర్‌అండ్‌బీ పరిధిలోని మావిళ్లపాడు నుంచి మంగానెల్లూరు వరకు ఏడు కిలోమీటర్లు రోడ్డు, పోలిరెడ్డి పాళెం నుంచి కల్లూరుకండ్రిగ వరకు నాలుగు కిలోమీటర్లు, ఆబాకు నుంచి కారికాడు వరకు ఉన్న 18 కిలోమీటర్లు రోడ్డు దెబ్బతిన్నాయని చెప్పారు. పూలతోట నుంచి సింగనాలత్తూరు వరకు ఆరు కిలోమీర్లు రోడ్డు కూడా గోతులమయంగా మారిందన్నారు. పిండిపాళెం నుంచి శ్రీధనమల్లి వరకు నాలుగు కిలోమీర్లు రోడ్డు దెబ్బతిందన్నారు. వీటి మరమ్మతులకు ఎఫ్‌డీఆర్ నిధుల కోసం ఆర్‌అండ్‌బీ ఏడీ చిన్నరాయుడు సుమారు రూ.50 లక్షలు వరకు ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని చవటకండ్రిగ, కరటాముడి, వేణుంబాకం, కారికాడు గ్రామాల్లో సుమారు 20 కిలోమీటర్లు రోడ్డు వరకు వరద దాటికి దెబ్బతిన్నాయని పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు చెప్పారు. వీటి మరమ్మతుకు ఎఫ్‌డీఆర్ నిధులు రూ.కోటి మంజూరుకు ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు.

అందరికీ సరుకులు ఇవ్వండి

గూడూరురూరల్: తుపాను బాధితులందరికీ నిత్యావసర వస్తువుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ డాక్టర్ జవహర్‌రెడ్డిని కోరారు. అమరావతిలోని సెక్రటేరియట్‌లో మంగళవారం చీఫ్ సెక్రటరీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వాకాడు మండలంలో జరిగిన విపత్తును కళ్లారా చూసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి నిత్యావసర వస్తువులు అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారన్నారు. అయితే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా చూస్తామని చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి తెలిపారని ఎమ్మెల్యే చెప్పారు. అనంతరం హైయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావును కలసి గూడూరులోని ఎస్‌కేఆర్ కళాశాలకు ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

బాధితులకు బాసటగా జగనన్న ప్రభుత్వం

నాయుడుపేటటౌన్: తుపాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులు, వరద బాధితులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాసటగా నిలిచి, ఆదుకుంటున్నారని వైఎస్సార్ సీపీ నాయకుడు కే రాజారెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని నరసారెడ్డికండ్రిగ, మహాలక్ష్మమ్మ కాలనీ, చంద్రబాబు, సంజయ్‌గాంధీ కాలనీల్లో బాధితులకు సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ అధికారులతో కలసి ఆయన నగదు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వరద బాధితులకు సత్వరమే నిత్యావసర సరుకులను అందించారన్నారు. తరువాత ముంపునకు గురైన ప్రతి ఇంటికీ రూ.2500 నగదును అందించి బాధితులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. అలాగే తుమ్మూరులో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యాదర్శి కే మోహన్‌రెడ్డి, కమిషనర్ శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులతో కలసి బాధితులకు నగదు పంపిణీ చేశారు. ఎన్‌ఎస్‌ఆర్ కాలనీలో కౌన్సిలర్ పీ నాగార్జున, ముత్యాలరెడ్డి, పాత బస్టాండు వద్ద కౌన్సిలర్ కే ఆశోక్ కుమార్ బాధితులకు నగదు పంపిణీ చేశారు.

37 మందికి రూ.6,52,500 నగదు అందజేత

నాయుడుపేట: తుపాను బాధితులకు ఎంపీడీఓ శివప్రసాద్ చేతులు మీదుగా మంగళవారం రైతులకు పరిహారం పంపిణీ చేశారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 37 మంది రైతులకు రూ.6,52,500 నగదును పరిహారంగా అందజేశారు. పశుసంవర్ధక శాఖ జేడీ రవికుమార్ మాట్లాడుతూ రైతులకు చెందిన గేదెలు, గొర్రెలు తుపాన్ కారణంగా మృత్యువాత పడ్డాయన్నారు. నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారంగా పరిహారం అందించనున్నట్లు తెలిపారు.


నాయుడుపేటటౌన్: నరసారెడ్డి కండ్రిగలో బాధితులకు నగదు అందజేస్తున్న రాజారెడ్డి

మోదుగులపాళెంలో..

దొరవారిసత్రం: మోదుగులపాళెం గ్రామానికి చెందిన 55 మంది వరద బాధితులకు గాను రూ.1.18 లక్షలు నగదును మంగళవారం స్థానిక రెవెన్యూ అధికారులు అందజేశారు. తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, సర్పంచ్ చెల్లమ్మ, నాయకులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట రూరల్: పట్టణంలోని అలవల వారి కల్యాణ మండపంలో జూనియర్ చాంబర్ సంస్థ సహకారంతో పట్టణంలోని నాగరాజుపురంలో తుపాను బాధితులకు మంగళవారం వంట సామగ్రి అందజేశామని జేసీఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ కాకి శ్రీరామమూర్తి తెలిపారు. తహసీల్దార్ కన్నంబాకం రవికుమార్ చేతుల మీదుగా సుమారు 400 మంది వరద బాధితులకు రూ.1200 విలువగల 38 రకాల వంట సామగ్రిని అందించినట్లు తెలిపారు. జేసీ ఇండియా తిరుపతికి చెందిన హర్ష కుమార్, డాక్టర్ నూరి పర్వీన్, హైదరాబాద్‌లోని నెస్లే ఇండియా మేనేజర్ వసీం అహ్మద్ ఆధ్వర్యంలో 38 రకాల వంట సామగ్రి కిట్లను అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీఐ నాయకులు వీ మహేష్, సాయి శరత్, కిశోర్ , భగవాన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.


నాయుడుపేట: పరిహారం అందజేస్తున్న అధికారులు




దొరవారిసత్రం: వరద బాధితులకు నగదు అందజేస్తున్న తహసీల్దార్, సూళ్లూరుపేటరూరల్: సరకుల కిట్ అందజేస్తున్న జేసీఐ సభ్యులు

పులికాట్‌లో జోరుగా చేపల వేట



మీజూరు సమీపంలో పులికాట్‌లో వలలతో చేపలు వేటాడుతున్న మత్స్యకారులు

దొరవారిసత్రం: మండలంలోని కారికాడు, మీజూరు, వేలికాడు తదితర గ్రామాల్లో విస్తరించి ఉన్న పులికాట్ సరస్సులో జోరుగా చేపల వేట సాగుతోంది. ఇటీవల విస్తారంగా వర్షాలు కురడంతో సరస్సులోని మంచినీటితోపాటు తూర్పుభాగంలో ఉన్న బంగాళఖాతం నుంచి అటుపోట్లకు ఉప్పునీరు పుష్కలంగా పులికాట్‌లోకి చేరాయి. దీంతో మత్స్య సంపద సమృద్ధిగా చేదడంతో తీర ప్రాంతాల్లోని ఎస్సీ, ఎస్టీలు సరస్సులో కొన్ని రోజులుగా చేపలు, రొయ్య వేట సాగిస్తున్నారు. వీటిని పట్టణాల్లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఇది ఇలా ఉండగా సూళ్లూరుపేట పట్టణానికి చెందిన పలువురు వ్యాపారులు ఈ ప్రాంతంలోని ఎస్సీ, ఎస్టీల నుంచి చేపలు, రొయ్యలు కొనుగోలు చేసి, ఆటోల్లో బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ఆర్బీకేల్లో ఎరువుల పంపిణీ

వెంకటగిరిరూరల్: రైతులకు ఆర్బీకేల ద్వారా ఎరువులను పంపిణీ చేస్తున్నట్లు ఏడీఏ నాగార్జునసాగర్ పేర్కొన్నారు. మండలంలోని వల్లివేడు, అమ్మపాళెం ఆర్బీకేల ద్వారా రైతులకు ఎరువులను మంగళవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా యురియా, డీఏపీ, కాంప్లెక్స్ తదితర నాణ్యమైన ఎరువులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు వెంకటగిరి మండలంలో 1,010 టన్నులు, బాలాయపల్లె మండలంలో 550, డక్కిలి మండలంలో 910 టన్నుల చొప్పున రైతులకు ఎరువులు పంపిణీ చేశామన్నారు. రైతుల అవసరానికి మించి మోతాదులో మందులు వేయవద్దని, అధికారుల సూచనల మేరకు ఎరువులను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుజాత, వీఏఏలు చెంచుభాస్కర్, రేఖ తదితరులు పాల్గొన్నారు.


ఎరువులను పంపిణీ చేస్తున్న ఏడీఏ నాగార్జున సాగర్

విద్యార్థులను కాపాడిన అన్నదమ్ములకు సన్మానం

దొరవారిసత్రం: మిచాంగ్ తుపాను సమయంలో కేజీబీవీ పాఠశాలలోకి వచ్చిన వరద నీటిలో చిక్కుకున్న విద్యార్థులను కాపాడిన అన్నదమ్ములను మంగళవారం సన్మానించారు. దొరవారిసత్రంలోని కేజీబీవీ పాఠశాలలోకి వరద నీరు చేరాయి. దీంతో పాఠశాలలో విద్యార్థులు చిక్కుపోయారు. ఆ సమయంలో ఏకొల్లు పంచాయతీ సర్పంచ్ ఆవల బ్లెస్సీ కుమారులు జగత్‌జీవన్‌కుమార్, భగత్‌బావన్ కుమార్ ధైర్యంగా వెళ్లి పాఠశాలలో ఉన్న విద్యార్థులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. వారి ధైర్య సాహసాలకు మెచ్చిన తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ రఘురామయ్య, ఎస్ఐ తిరుమలరావు వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ పార్వతి తదితరులు పాల్గొన్నారు.


అన్నదమ్ములను సన్మానిస్తున్న అధికారులు, టీచర్లు

ఆనం వెంకటగిరి ప్రజలను మోసం చేశారు

వెంకటగిరిరూరల్: నియోజకవర్గ ప్రజలను ఆనం రామనారాయరెడ్డి మోసం చేశారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. పట్టణంలోని 12వ వార్డులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల గురించి వివరించి, స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. ఆ వార్డులోని ఓ మహిళ తమకు జగన్నకాలనీ ఇంటి స్థలానికి సంబంధించి నంబర్ ఇచ్చారని, పట్టా ఇప్పటి వరకు మంజూరు కాలేదని నేదురుమల్లి ముందు వాపోయింది. దీనిపై స్పందించిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆనం హయాంలో జరిగిన అవినీతిని సరిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, విప్ పి లక్ష్మి, కౌన్సిలర్లు చంద్రశేఖర్, ఏ శంకరయ్య, ఏ శ్రీనివాసులు, వహిద, కళ్యాణి, వైఎస్సార్‌సీపీ నేతలు ఆర్ చిన్నా, పి ప్రకాష్, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.


బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పరామర్శ

వెంకటగిరి పట్టణంలోని 12వ వార్డు మల్లమ్మగుడి ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కే చిరంజీవి బ్రెయిన్ స్ట్రోక్ గురై తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అతడి నివాసం వద్దకు చేరుకుని తమ కుటుంబ సభ్యులను అతడి ఆరోగ్య పరిస్థితిని వివరించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

డక్కిలి: పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని వెంకటగిరి సీఐ సంగమేశ్వరరావు సూచించారు. స్థానిక పోలీసుస్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులపై పోలీసులు గౌరవంగా మెలగాలన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తుల సంచరిస్తే ప్రజలు పోలీసులకు తెలియజేయాలని సూచించారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. పోలీసులు ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. రాత్రి సమయంలో వెంకటగిరి-రాపూరు హైవే పై గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్ కేసులను త్వరతగతిన పరిష్కరించాలని పోలీసులకు సూచించారు. పలు రికార్డులను పరిశీలించారు.రికార్డులను పక్కాగా నమోదు చేయాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న వెంకటగిరి సీఐ

నూరు శాతం ఫలితాలు సాధించాలి

చిట్టమూరు: ప్రభుత్వ పాఠశాల్లో ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు సాధించాలని డిప్యూటీ డీఈఓ శివప్రకాష్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన స్థానిక జెడ్పీ హైస్కూలును తనిఖీ చేశారు. ఏడుగురు ఉపాధ్యాయుల ప్యానల్‌తో పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల ప్రతిభను పరీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటుకు దీటుగా నాడు-నేడు కింద నూతన పాఠశాల భవనాలను నిర్మిస్తుందన్నారు. అలాగే విద్యార్థులకు ఉచితంగా విద్యాసామగ్రితోపాటు మధ్యాహ్నం పౌష్టికాహారం అందజేస్తుందన్నారు. అనంతరం డిప్యూటీ డీఈఓను ఉపాధ్యాయులు సత్కరించారు. హెచ్‌ఎం మీనాకుమారి, ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, శ్రీనివాసులు, సురేంద్రరెడ్డి, కామేశ్వరమ్మ, సుభాషిణి పాల్గొన్నారు.


డిప్యూటీ డీఈఓను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

జామాయిల్ తోటల పరిశీలన

కలువాయి: స్థానిక వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో అభివృద్ధి చేసి, ప్రస్తుతం కటింగ్ జరుగుతున్న జామాయిల్ తోటలను గుంటూరు స్క్వాడ్ డీఎఫ్ఓ మారుతీ ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. జామాయిల్ కటింగ్ ఎలా చేయాలన్న విషయమై కూలీలకు సూచనలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ జామాయిల్ మొక్కల విక్రయం ద్వారా వచ్చే మొత్తంలో సగభాగం వనసంరక్షణ సమితి సభ్యులకు పంపిణీ చేస్తామని, మిగిలిన సగభాగం అటవీ అభివృద్ధికి ఉపయోగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్క్వాడ్ రేంజర్ హరి, రాపూరు రేంజర్ రవీంద్రబాబు, కలువాయి డీఆర్వో బాలాజీ, సిబ్బంది నాగులు, జనార్దన్, భాగ్యరాజ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.


జామాయిల్ తోటల కటింగ్ పనులను పరిశీలిస్తున్న స్క్వాడ్ డీఎఫ్ఓ మారుతీ ప్రసాద్, ఇతర అధికారులు

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఆబాక యువతి

సూళ్లూరుపేట రూరల్: స్కూల్ గేమ్స్ పోటీల్లో సూళ్లూరుపేట మండలంలోని ఆబాక గ్రామానికి చెందిన డి. విజయ శాంభవి అనే యువతి అండర్-19 విభాగంలో 100 మీటర్ల హార్డిల్స్ మొదటి స్థానం దక్కించుకుని జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు తెలిపారు. విజయ శాంభవి సూళ్లూరుపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సవత్సవరం చదువుతోందన్నారు. ఈనెల 12, 13, 14 తేదీల్లో పల్నాడు జిల్లా సరసరావుపేటలో జరిగిన 67వ అంతర్రాష్ట్ర స్కూల్ గేమ్స్ వంద మీటర్ల హార్డిల్స్‌లో పోటీ పడి, మొదటి స్థానం దక్కించుకుని బంగారు పతకం సాధించిందని చెప్పారు. దీంతో ఆమె జాతీయ అథ్లెటిక్స్‌కు ఎంపికైందన్నారు. ఈనెల 25వ తేదీన మహారాష్ట్రలో జరగనున్న జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొంటుందన్నారు.


విజయశాంభవి